## క్లుప్తంగా

### చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చంటి

ఏలూరు (టూటౌన్): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదం చేస్తాయని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. స్థానిక సత్రంపాడులోని లక్ష్మీ గణపతి ఆలయం వద్ద శనివారం ఆయన చలివేంద్రాన్ని ప్రారంభించారు. బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### ముగిసిన డీఈఎల్ఈడీ పరీక్షలు

ఏలూరు (టూటౌన్): డీఈఎల్ఈడీ థర్డ్, ఫస్ట్ సెమిష్టర్ పరీక్షలు ముగిశాయి. శనివారం డీఈఎల్ఈడీ థర్డ్ సెమిష్టర్ పరీక్షలకు 46 మంది విద్యార్థులకు 45 మంది హాజరయ్యారు. ఫస్ట్ సెమిష్టర్ పరీక్షలకు 92 మందికి 89 మంది హాజరయ్యారని డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

### ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఉంగుటూరు: రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెట్రి సెల్వి తెలిపారు. శనివారం ఉంగుటూరులో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుతో కలిసి క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయిలో వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1400 మంది రైతులకు 3.94 కోట్లు రాయితీ ఇస్తున్నామని తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 115 మంది రైతులకు 77 లక్షల రాయితీపై పరికరాలు అందజేశామని వివరించారు. రైతులు ఆధునిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని సాగు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో పంటలు పండించే విధానాన్ని రైతులు అలవాటు చేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాలు సబ్సిడీతో పంపిణీతో పాటు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి రైతు సేవాకేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, నారాయణపురం, ఉంగుటూరు సర్పంచ్‌లు దిడ్ల అలకానంద, బండారు సింధు, అధికారులు పాల్గొన్నారు.

# సర్టిఫికెట్ కావాలంటే అగచాట్లే!

- గతంలో పండుగలా సురక్షా శిబిరాలు
- నేడు సంక్షేమాన్ని విస్మరించిన కూటమి సర్కారు

ఏలూరు టౌన్ : నాడు ప్రజలకు మేలు చేయాలనే తపన, ఆకాంక్ష ఉంటే చాలు అద్భుతాలు చేయవచ్చని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారు. దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేస్తూ ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లి అత్యుత్తమ స్థాయిలో సేవలు అందించి శభాష్ అనేలా పాలన సాగించారు. ఐదేళ్లకోసారి ఎన్నికలప్పుడే జనం వద్దకెళ్లే విధానానికి స్వస్తి పలికారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు నిత్యం ప్రజల రక్షణ, సంరక్షణ, బాగోగులు చూడాలనే నూతన సంస్కృతికి నాంది పలికారు. జగనన్న సురక్ష ప్రోగ్రామ్‌తో జనంతో మమేకమయ్యేలా కార్యక్రమాన్ని రూపొందించారు. ప్రతి కుటుంబానికి కుటుంబ పెద్దలా అండగా నిలబడ్డారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు కావచ్చినా ప్రజల సంక్షేమం, అవసరాలను పట్టించుకున్న నాథుడు కరువయ్యారు. ప్రజల అవసరాలకు నేడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా పనయ్యే పరిస్థితి లేదు. చోటా నాయకులను ప్రసన్నం చేసుకుంటే తప్ప ఏ సర్టిఫికెట్ చేతికి రాని పరిస్థితి. వైఎస్సార్ సీపీ హయాంలో అన్ని ఇంటికే వచ్చాయని, నేడు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అధికారులు, రాజకీయ నేతలను బతిమిలాడుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని జనం గగ్గోలు పెడుతున్నారు.



ఏలూరులో జగనన్న సురక్ష శిబిరం (ఫైల్)

**నాడు జగనన్న సురక్ష**

ఏలూరు నియోజకవర్గంలో జగనన్న సురక్ష కార్యక్రమం నాడు విజవంతమైంది. ఏలూరు నగరంలో పండుగ వాతావరణంలో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఐదు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా గుర్తిస్తూ సుమారుగా 16 సురక్ష శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒకవైపు కార్పొరేటర్ల నాయకత్వంలో గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు వారం రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఏం కావాలో తెలుసుకుని మరీ ఆన్‌లైన్ దరఖాస్తు చేసి, సురక్ష శిబిరంలో అందజేశారు.

### మూడు రోజుల్లో సర్టిఫికెట్

ఏలూరు నగరంలో 16 రోజులపాటు సాగిన జగనన్న సురక్ష శిబిరాల్లో భారీ ఎత్తున ప్రజలకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. గతంలో రోజుల తరబడి కార్యాలయల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితికి చెక్ పెడుతూ దరఖాస్తు చేసిన మూడు రోజులకే లబ్ధిదారుని చేతిలో సర్టిఫికెట్‌ను పెట్టారు. నాడు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాల వివరాలివీ..

| | |
|---|---|
| మొత్తం ధ్రువీకరణ పత్రాలు | 53,854 |
| ఆదాయ ధ్రువీకరణలు | 10,867 |
| కుల ధ్రువీకరణలు | 31,174 |
| ఆధార్ అప్‌డేట్ రిక్వెస్ట్ | 3091 |
| రైస్‌కార్డుల్లో మార్పులు చేర్పులు | 230 |
| ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు (ఎఫ్ఎంసీ) | 46 |
| వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు | 16 |
| డెత్ సర్టిఫికెట్ | 01 |
| బర్త్ సర్టిఫికెట్ | 01 |
| ఇతర ధృవీకరణ పత్రాలు | 8428 |

### కానరాని ప్రజా సంక్షేమం



వైఎస్సార్ సీపీ హయాంలో ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చారు. ప్రతి సర్టిఫికెట్‌ను ఇంటి వద్దకే తీసుకెళ్లి ఇచ్చేలా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేసి చూపించారు. నేడు కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పట్టించుకునే పరిస్థితి లేదు. విద్యార్థులు, యువత ఆయా సర్టిఫికెట్ల కోసం రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. కక్షసాధింపులే కాదు ప్రజల సంక్షేమానికీ ప్రాధాన్యత ఇవ్వాలి.

– నూకపెయ్యి సుధీర్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్

### పాలన గాలికి



కూటమి ప్రభుత్వం ప్రజాపాలనను గాలికి వదిలేసింది. 10 నెలలు కావస్తున్నా నేటికీ ఎన్నికల హామీలను అమలు చేయలేకపోయింది. ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు ఆయా పోటీ పరీక్షల కోసం సర్టిఫికెట్లు మంజూరుకు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు సులువుగా సర్టిఫికెట్లు, పాలన అందేలా కృషి చేయాలి.

– వైఎస్‌వీ శివరావు, జేసీఎస్ మాజీ కన్వీనర్

## పహల్గాం ఘటన దారుణమైన చర్య



పహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఏలూరు (టూటౌన్): పహల్గాం ఘటన దారుణమైన చర్య అని, మృతుల కుటుంబాలకు ఎస్టీయూ తీవ్ర సంతాపం తెలిపింది. ఇటీవల జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన దుర్ఘటనను ఖండిస్తున్నామని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పీబీవీఎస్ఎల్ నారాయణ పేర్కొన్నారు. ఎస్టీయూ ఏలూరు నగర శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పహల్గాం ఘటనలో అమరులైన వారికి సంతాపం తెలిపారు. ఎస్టీయూ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ పవన్ కుమార్ మాట్లాడుతూ ఇది ఉగ్రవాదుల పిరికిపంద చర్య అని, ఏ సంబంధం లేని యాత్రికులపై పైశాచిక దాడి అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పీవీ రత్నాకరరావు, జి.రాఘవులు, ఎ.నాగరాజు, వి.దక్షిణామూర్తి, ఎ.మధు, పి.కుసుమాకరరావు, కేవీ షఢ్రక్, బి.భాస్కర్, పి.ఏసుమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని సవరించాలి

ఏలూరు (టూటౌన్): ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:53గా పరిగణించి రేషనలైజేషన్ చేయడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించలేమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు పేర్కొన్నారు. ఆ నిష్పత్తిని 1:40గా మార్పు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తరగతిలో 53 మంది వరకు విద్యార్థులు ఉంటే ఒక సెక్షన్, 54 మంది దాటితే రెండో సెక్షన్‌గా భావిస్తూ సెక్షన్‌ల ప్రతిపదికన స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేస్తున్నారని తెలిపారు. 1:53 ప్రకారం సెక్షన్‌ల ప్రాతిపదికన స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయింపు వల్ల ప్రతి పాఠశాలలోనూ సర్‌ప్లస్ ఉపాధ్యాయులు అధికమయ్యారని వివరించారు. ఈ మిగులు ఉపాధ్యాయులను ఏం చేయాలన్న విషయమై రకరకాల ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకున్నారని తెలిపారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి సవరించి స్కూల్ అసిస్టెంట్లను ఉన్నత పాఠశాలల్లోనే కొనసాగిస్తే విద్యార్థులకు న్యాయం జరుగుతుందని ఆంజనేయులు వివరించారు.

### జంగారెడ్డిగూడెంలో తనిఖీలు



బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతున్నామని డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. జంగారెడ్డిగూడెంలో శనివారం ఆయన విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఉగ్రదాడులు నేపథ్యంలో అసాంఘిక శక్తుల ఉనికి లేకుండా పట్టణంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టినట్టు చెప్పారు. లాడ్జీలు, బస్టాండ్, జనసమర్ధం ఉన్న ప్రాంతాలు, అనుమానిత ప్రాంతాల్లో పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీలు చేశామన్నారు. అనుమానిత వ్యక్తులతో పాటు, గంజాయి, సారా, మద్యం రవాణా, మదక ద్రవ్యాల రవాణా తదితర వాటిపై కూడా తనిఖీలు చేపట్టామని వివరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎటువంటి కార్యకలాపాలైనా ఉపేక్షించేది లేదన్నారు. డీఎస్పీ వెంట ఏఎస్సై వై.మంగయ్య, ఎస్ ఉమామహేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు. మండలంలోని లక్కవరంలో ఎస్సై డి.శశాంక ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేశారు.

## న్యాయమూర్తులకు ఘన స్వాగతం



జస్టిస్ మన్మథరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా ప్రధానన్యాయమూర్తి శ్రీదేవి, కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు (టూటౌన్): ఏలూరు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తులు కె.మన్మథరావు, వీఆర్‌కే కృపాసాగర్‌లకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, జిల్లా అధికారులు శనివారం ఘన స్వాగతం పలికారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో జ్యూడిషియల్ అధికారులకు ఒక రోజు శిక్షణ తరగతులకు విచ్చేసిన వారికి ముందుగా స్థానిక రెవెన్యూ గెస్టు హౌసులో పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. హైకోర్టు జడ్జీలను కలిసిన వారిలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శ్రీదేవి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి యం.రామకృష్ణంరాజు, ఇతర న్యాయమూర్తులు ఉన్నారు.

## చదరంగంతో మేధస్సు పెంపు



చెస్ పోటీలను తిలకిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): చదరంగం పోటీలు పిల్లల మేధస్సు పెంపునకు దోహదం పడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు అన్నారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాలు, మేడే సందర్భంగా శనివారం ఉదయం స్థానిక ఆర్ఆర్‌పేటలోని సీపీఐ ఆఫీస్ స్ఫూర్తి భవన్‌లో రెండు రోజుల జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డాంగే, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా నాయకులు పి.కిషోర్‌లు మాట్లాడారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి అప్పలరాజు, నాయకులు బి జగన్నాథరావు, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్, యర్ర వెంకటేశ్వర్లు, కె.జగన్, చెస్ టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ కృష్ణకుమారి, కోచ్ లక్ష్మణరావు, సహాయకులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సుజీవరాజు సేవలు చిరస్మరణీయం



సుజీవరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దెందులూరు: బైబిల్ మిషన్ పాస్టర్ సుజీవరాజు పైడిచింతపాడు, ప్రత్తికోళ్లలంక, మల్లవరం గ్రామాలతో పాటు ప్రాంతాలకు అతీతంగా చేసిన దేవుని సేవ చిరస్మరణీయమని, ఏ రంగంలోనైనా అంకిత భావంతో చేసిన పని ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు మోరు రామరాజు, వడ్డీలు కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ముంగర సంజీవ్ కుమార్, ఐఆర్ఎస్ రిటైర్డ్ ఆఫీసర్ చాగంటి సంజీవ్ అన్నారు. శనివారం ఏలూరు రూరల్ మండలం పైడి చింతపాడు బైబిల్ మిషన్ చర్చిలో ఏపీ ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్, డాక్టర్ సుజీవరాజు కుటుంబ సభ్యులు, సంఘ సభ్యులు ఆధ్వర్యంలో పాస్టర్ సుజీవరాజు సంస్మరణ సభ నిర్వహించారు. కొల్లేరు గ్రామాల నుంచి వేలాదిమంది విశ్వాసులు వందలాది మంది పాస్టర్లు సంస్మరణ సభకు హాజరై ఆయన సేవలను కొనియాడారు.

### మృతుల కుటుంబాలకు పరామర్శలు



నాగరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాలరాజు

బుట్టాయగూడెం: ఇటీవల కారు ప్రమాదంలో మృతి చెందిన కుంజా నాగరాజు మృతి వైఎస్సార్ సీపీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బూరుగువాడలో శనివారం నాగరాజు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. నాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగరాజు పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. నాగరాజు కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. సర్పంచ్ జోడే సత్యదుర్గాప్రసాద్, నాయకులు కుంజం భూమయ్య, తెల్లం భీమరాజు పాల్గొన్నారు.

**రామరాజుకు నివాళి**

కొయ్యలగూడెం: కోసూరు రామరాజు మృతి వైఎస్సార్ సీపీకితీరని లోటని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. కన్నాపురంలోని రామరాజు నివాసానికి వెళ్లి శనివారం బాలరాజు పార్టీ నాయకులతో కలిసి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. పార్టీకి రామరాజు చేసిన కృషిని గుర్తుచేశారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు డాక్టర్ శ్రీనివాస్, ఉప్పల కృష్ణ, ఎండీ షాబాజ్, అంబటి శ్రీను, కేశవ, ఎస్‌కే సిరి, మందపాటి రామకృష్ణ, నండూరి వీరబాబు, సొంగ కిషోర్, కలపాల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

### కన్నాపురం వాసికి గిన్నిస్ బుక్‌లో స్థానం



అవార్డు అందుకుంటున్న నాగ సౌమ్య ప్రదీప్

కొయ్యలగూడెం: కన్నాపురానికి చెందిన జలగం నాగ సౌమ్య ప్రదీప్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం దక్కింది. ఆమె శుక్రవారం విజయవాడలో మెట్రో పోలిటీన్ చర్చిలో మెడల్స్, సర్టిఫికెట్లను అందుకున్నట్టు తెలిపారు. 2024 డిసెంబర్ ఒకటో తేదీన విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో హలేల్ మ్యూజిక్ స్కూల్ నుంచి బ్రదర్ అగస్టీన్ దండంగి ఆధ్వర్యంలో 1090 మంది విద్యార్థులు పియానో స్వరాలను ఇంస్ట్రాగామ్‌లో అప్లోడ్ చేయగా, 1046 మంది గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించారని పేర్కొన్నారు. రికార్డును సొంతం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. 2024లో కూడా తాను ఆసియ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంజినియోస్ చార్మ్ వరల్డ్ రికార్డ్ సొంతం చేసుకున్నాని గుర్తుచేశారు.

### మైనర్లు వాహనాలు నడపొద్దు

జంగారెడ్డిగూడెం: మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ వి.కృష్ణబాబు హెచ్చరించారు. జంగారెడ్డిగూడెంలో శనివారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలు నడుపుతున్న మైనర్‌లను గుర్తించి, వారిని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణబాబు మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్‌లో ఆరు మోటార్‌సైకిళ్లను సీజ్ చేశామని, మైనర్‌లకు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై ఆర్.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 18 | అరటి కాయ (1) | 06-08 |
| వంకాయలు (గులాబీ) | 24 | చిక్కుడు కాయలు | 76 |
| వంకాయలు (కాంతులు) | 34 | బీన్స్‌చిక్కుడు | 84 |
| వంకాయలు (తెలుపు) | 26-34 | చామదుంపలు | 54 |
| బెండకాయలు | 26 | ములక్కాడలు | 08, 10 |
| పచ్చిమిర్చి | 36 | కంద | -- |
| కాకర కాయలు | 32 | బీట్‌రూట్ | 28 |
| బీరకాయలు | 30-40 | కీరా దోస | 36 |
| బీరకాయలు (పందిరి) | -- | ఫ్రెంచ్‌బీన్స్ | 70 |
| క్యాబేజీ | 20 | అల్లం | 60 |
| క్యారెట్ | 34 | కొత్తిమీర (కట్ట) | 25 |
| దొండకాయలు | 20 | పాలకూర | 12 |
| బంగాళదుంపలు | 32 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 24 | చుక్కకూర | 12 |
| గోరుచిక్కుడు | 36 | గోంగూర | 07-10 |
| దోసకాయలు | 20 | పుదీనా | 05 |
| ఆనబకాయ (1) | 20 | క్యాప్సికమ్ | 60 |
| పొట్లకాయ(1) | 20-25 | చిలకడదుంప | 40 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

### ఏసీ బస్సులు..

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 09 |
| ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర) | 21.30 | 30 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.00 | 25 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్) | 22.30 | 25 |
| ఏలూరు - తిరుపతి (ఇంద్ర) | 19.00 | రద్దు |

### సూపర్ లగ్జరీ

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 15 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.15 | 4822 | 18 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 18 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 07 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 17 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 16 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 33 |

## వేడుకగా శ్రీపుష్ప యాగోత్సవం



శ్రీపుష్ప యాగోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



విశేష పుష్పాలంకారాల్లో స్వామి, అమ్మవార్లు



శివయ్యకు అభిషేకం చేస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఉపాలయమైన లక్ష్మీపురం సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు శనివారం విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఉదయం ఆలయంలో శ్రీనివాసునికి, పద్మావతి, అండాళ్ అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ యజ్ఞశాలలో హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఆలయంలో ద్వాదశ కోవెల ప్రదక్షిణలను వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి, అమ్మవార్లకు శ్రీ పుష్పయాగోత్సవాన్ని అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**రుద్రాభిషేకం, శనిత్రయోదశి పూజలు**

ద్వారకాతిరుమల: శ్రీవారి ఉపాలయం, క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి, శనిత్రయోదశిని పురస్కరించుకుని విశేష కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు గర్భాలయంలో కొలువైన శివయ్యకు వేద మంత్రోచ్ఛరణల నడుమ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, పూజజలు చేసి హారతులిచ్చారు. ఆలయ ఆవరణలోని నవగ్రహాలకు పూజలు చేసి, తైలాభిషేకాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం గంగా, పార్వతీ సమేత శివయ్య నంది వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు.